# రెండెకరాలకు ఐదు ట్యాంకర్లతో నీళ్లు



పొలానికి ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్న రైతు మోహిన్‌రెడ్డి

కోనరావుపేట, మార్చి 12: చుట్టూ ప్రాజెక్టులున్నా సాగునీటి కోసం రైతులు తండ్లాడుతున్నారు. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. నిజామాబాద్‌కు చెందిన రైతు మోహిన్‌రెడ్డి వాటర్ ట్యాంకర్‌తో తన రెండెకరాల పంటలకు నీరందిస్తున్నాడు. పక్కనే మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ ఉన్నా నీళ్లు రావడం లేదని, బోర్లు అడుగంటాయని వాపోతున్నాడు. 3లక్షల రూపాయలు వెచ్చించి నాలుగు బోర్లు వేసినా ఒక్క బోరులోనూ చుక్క నీరు పడలేదని ఆవేదన చెందుతున్నాడు. ఈ పరిస్థితుల్లోనే పొట్ట దశలో ఉన్న రెండెకరాల వరి పంటను కాపాడుకునేందుకు వెయ్యి రూపాయలకో ట్యాంకర్ చొప్పున ఐదు ట్యాంకర్లతో నీటిని తెప్పించి, పొలానికి పారించానని చెప్పాడు.

## 15న జాబ్‌మేళా

జగిత్యాల రూరల్, మార్చి 12: జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 15న జగిత్యాల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మజ సుజికి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సర్వీస్ సలహాదారులు (ఇద్దరు), సేల్స్ ఎగ్జిక్యూటివ్ మేన్ (ఒకరు), క్యాషియర్ (ఒకరు), టెక్నిషియన్ (ఒకరు) పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీసం డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణత కలిగి ఇంగ్లీష్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.15వేల వేతనం ఇస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# బోర్లు, బావులే దిక్కు!

## .. అయినా సాగునీటికి తండ్లాటే





బావి తవ్వుతున్న ప్రొక్లెయినర్, రైతు సరోజన (ఇన్‌సెట్)

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు సరోజన. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామం. ఆమెకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. యాసంగిలో వరిసాగు చేసింది. నిజానికి మొగ్దుంపూర్ వరకు ఎస్సారెస్పీ కెనాల్ ఉంది. కానీ, సరిపడా నీళ్లు రావడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయి. వేసిన వరి పంటను కాపాడుకోవడానికి సరోజ నానా పాట్లు పడుతున్నది. తన పాత బావి వినియోగించుకోవడానికి గంటకు నాలుగు వేల రూపాయలు ఖర్చు చేసి పొక్లెయినర్‌తో పూడిక తీయిస్తున్నది. కేసీఆర్ సారు ఉన్నప్పుడు కాలువలో పుష్కలంగా నీళ్లు చివరకు అచ్చేవని, ఇప్పుడు అప్పుడప్పుడు ఇస్తున్నా చివరి వరకు రావడం లేదని సరోజన వాపోతున్నది. అందుకే పంటను కాపాడుకునేందుకు గత్యంతరం లేక చేతిలో డబ్బులు లేకపోయినా పూడిక తీపిస్తున్నానని చెబుతున్నది.

- అడుగడుగునా సర్కారు నిర్వహణ లోపం
- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చివరి ఆయకట్టుకు అందని కాలువల నీళ్లు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- కండ్ల ముందే ఎండిపోతున్న పంటలు
- బోర్లు, బావులవైపు రైతులు
- అప్పులు తెచ్చి మరీ తవ్వకం
- ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

ఏడాదిన్నర కిందటి వరకు పుష్కలమైన నీళ్లతో కనిపించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లాను ఇప్పుడు కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ప్రభుత్వ ప్రణాళికా లోపంతో సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూగర్భజలాలు రోజురోజుకూ గణనీయంగా తగ్గుతుండగా, కాలువల్లో నీరు రాక రైతులు బోర్లు, బావుల బాట పడుతున్నారు. అప్పులు తెచ్చి మరీ తవ్విస్తున్నారు. అయినా పెద్దగా ప్రయోజనం లేక పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే తమకీ దుస్థితి వచ్చిందని వాపోతున్నారు.



గంగాధర మండలం వెంకంపల్లిలో నీరు లేక నెర్రెలు బారిన పొలం

కరీంనగర్, మార్చి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/గంగాధర : తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చి వేశారు. ప్రాజెక్టులు పూర్తి చేసి కడుపునిండా సాగునీరిచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. అంతేకాదు, రాజన్న సిరిసిల్ల లాంటి మెట్ట ప్రాంతానికి ప్రాజెక్టుల నీటిని తరలించి.. చెరువులు, కుంటలు నింపి భూగర్భజలాలు పెంచి, ఐఏఎస్‌లకే ఒక పాఠ్యాంశంగా మార్చారు. కానీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మళ్లీ సమైక్య రాష్ట్ర పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. అప్పటి కరువు ఛాయలు రాజ్యమేలుతున్నాయి. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా.. చెరువులు, కుంటలు నింపడంలో ప్రభుత్వం వైఫల్యం అవుతుండడంతో భూగర్భజలాలు రోజురోజుకూ గణనీయంగా తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు తమ పంటలు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. మళ్లీ బావుల బాట పడుతూ పాత బావులు అడుగులు తీయిస్తూ.. కొత్త బావులు తవ్విస్తున్నారు. అప్పులు తెచ్చి మరీ బోర్లు వేయిస్తున్నారు. ఈ పరిస్థితులు మున్ముందు ఎటువైపు దారితీస్తాయో అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. మచ్చుకు ఒక మండలాన్ని తీసుకొని చూస్తే.. గంగాధర మండలం వెంకంపల్లి, ఉప్పరమల్యాల, రంగరావుపల్లి, కాసారం, గర్శకుర్తి గ్రామాల పరిధిలో సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. కేసీఆర్ సర్కారు ఉన్న సమయంలో నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి ఆయా గ్రామాల్లోని చెరువులను నింపడంతో ఎండకాలంలోనూ జలకళను సంతరించుకొని సాగునీటికి భరోసానిచ్చాయి. రైతులు ఏ ఇబ్బంది లేకుండా పంటలు పండించుకున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించి డీ4 కెనాల్ ద్వారా చెరువులు నింపడానికి ప్రభుత్వం, అధికారులు చొరవ చూపకపోవడం, నారాయణపూర్ కుడికాలువ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఎప్పుడు చూడని విధంగా ఈ యేడాది సాగునీటి ఎద్దడి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బావుల్లో నీరు అడుగంటడంతో పంటలను కాపాడుకోవడానికి బోర్లు వేయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఒక్కో రైతు రెండు, మూడు బోర్లు వేసినా చుక్కా నీరు రాక.. పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడుకోవడం ఎలాగో తెలియక ఆగమవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండగా, తప్పని పరిస్థితుల్లో పంటలు కాపాడుకోవడానికి బావులు, బోర్ల బాట పట్టక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.



బావిని తవ్వేందుకు క్రెయిన్ ద్వారా లోపలికి దిగుతున్న రైతు మధు

### 700 ఫీట్లు వేసినా చుక్కా నీరు రాలేదు



గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన అట్టిపల్లి మధుకు కురిక్యాల, ఉప్పరమల్యాల గ్రామాల శివారులో 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కేసీఆర్ సర్కారు హయాంలో చెరువుల్లో నీరు నిండుగా ఉండడంతో ఉన్న ఒక్క బావి, బోరుతోనే పొలానికి నీళ్లు పెట్టి పంటలు పండించాడు. ప్రస్తుతం పరిస్థితి మారింది. బావిలో నీళ్లు లేకపోవడంతో నాలుగున్నరెకరాల్లో మాత్రమే వరి సాగు చేశాడు. బావిలో నీరు అడుగంటడంతోపాటు ఉన్న ఒక్క బోరు వట్టిపోయింది. దీంతో పంటను కాపాడుకోవడానికి లక్షా 80 వేల రూపాయలతో మరో బోరు వేయించినా చుక్కా నీరు రాలేదు. దీంతో మధు ఆందోళన చెందాడు. ఎలాగైన పంటను కాపాడుకోవలన్న ఉద్దేశంతో 98 వేల రూపాయలతో మరో బోరు వేశాడు. రెండు బోర్లు వేస్తే.. ఒక్క బోరు నుంచి కొద్ది పాటి నీరు మాత్రమే వస్తున్నదని మధు వాపోయాడు. బావిలో ఉన్న కొద్ది పాటి నీటితో పొలాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.

### నాలుగు చెరువులున్నా.. ఒక్కదాంట్లో నీరు లేదు



గంగాధర మండలం ఉప్పరమల్యాలకు చెందిన అమిరిశెట్టి రవికి పదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అందులో ఏడెకరాల్లో వరి, మూడెకరాల్లో పత్తి సాగు చేశాడు. బావిలో నీరు అడుగంటడంతో రెండు లక్షల రూపాయలతో రెండు బోర్లు వేయించాడు. అయినా రెండు బోర్లలో నీరు రాలేదు. ఏడెకరాల్లో నాలుగెకరాల్లో వరి ఎండిపోగా, మిగిలిన పంటను కాపాడుకోవడానికి తండ్లాడుతున్నాడు. బావిలో ఉన్న కొద్దిపాటి నీటితో రోజు విడిచి రోజు నీరు పెడుతున్నాడు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు నారాయణపూర్ కెనాల్ నుంచి ఊర్లో ఉన్న నాలుగు చెరువులను నింపడంతో సాగునీటికి ఇబ్బంది రాలేదని రవి గుర్తు చేస్తున్నాడు. ప్రస్తుత పాలకులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో గతంలో ఎప్పుడు చూడని విధంగా బావుల, బోర్లు ఎండిపోతున్నాయని, పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

..పక్క చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు దొంగల మధు. మానకొండూర్ మండలం నిజాయితీ గూడెం. ఆయనకు మొత్తం 76 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. ఎకరంలో వరి సాగు చేశాడు. 25 గుంటల్లో కూరగాయలు పండిస్తున్నాడు. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు తగ్గి పంటలు ఎండిపోతుండగా, వాటిని కాపాడుకునేందుకు తన భూమిలోని బావిని లోతుగా తవ్వుతున్నాడు. పంట దక్కాలంటే బావి తవ్వక తప్పడం లేదని, అందు కోసం లక్ష రూపాయల దాకా ఖర్చవుతున్నదని వాపోయాడు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడు కరువు కనిపించలేదని, తన భూమికి ఫసలుకు 9,600 రూపాయల చొప్పున రైతు బంధు వచ్చేదని గుర్తు చేసుకున్నాడు. కాంగ్రెస్ వచ్చినప్పటినుంచి రైతు భరోసా కింద కేవలం రూ. 800 మాత్రమే వచ్చాయని, ఇందేంటని అధికారులను అడిగితే ఎవరూ చెప్పడం లేదని వాపోయాడు. ఈ బాయి తవ్వుడు అయినంక మళ్లీ అధికారులను కలుస్తానని చెప్పాడు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఆయన ఏం చేసిండో.. ఎట్ల చేసిండో తెలియదు గానీ, టంఛన్‌గా రైతు బంధువేసిండని గుర్తు చేశాడు. ఇప్పుడు మాత్రం అట్ల లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒకే ఒకసారి అది కూడా నాకే రూ. 800 పడ్డయంటే అర్థం చేసుకోవాలని చెబుతున్నాడు. అప్పుడున్న భూమి.. ఇప్పుడున్న భూమి ఒక్కటేనని, గుంట కూడా అమ్మలేదని, కాంగ్రెసోళ్లు ఎన్నికల్లో జెప్పింది జూస్తే.. ఇంకా ఎక్కువ రావాలే గానీ, రూ. 800 మాత్రమే వేసిండని, ఎందుకు అట్ల జేసింగ్రో తెలియదంటున్నాడు. ఇక నీళ్ల పరిస్థితి ఇట్లనే ఉందని వాపోతున్నాడు.



మధు బావిలో అడుగంటిన జలాలు



వెల్గటూర్: పోలీసుస్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

## మాజీ సర్పంచులపై నిర్బంధకాండ


నమస్తే నెట్‌వర్క్, మార్చి 12: మాజీ సర్పంచులను ప్రభుత్వం నిర్బంధించింది. బుధవారం వేకువజామునే పోలీసులతో అరెస్ట్ చేయించింది. గతంలో గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కొన్ని నెలలుగా మాజీ సర్పంచులు పోరాటం చేస్తున్నారు. నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నా సర్కారు స్పందించకపోవడంతో అసెంబ్లీ ముట్టడించి తన ఆవేదన తెలియజేయాలని భావించారు. అయితే బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలైన నేపథ్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మాజీ సర్పంచులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఠాణాలకు తరలించారు. కాగా, మాజీ సర్పంచులు మాట్లాడుతూ ఓ వైపు ప్రజా పాలనగా అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.






# కాంగ్రెస్ అంటేనే కరువు

- 42ఏండ్ల పాలనలో తెలంగాణలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు నిర్మించలేదు
- చిల్లర రాజకీయాలతో రైతుల పంటలకు నీరివ్వడం లేదు
- మా పార్టీ కార్యకర్తలను వేధిస్తే సహించేదిలేదు
- బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం
- విమర్శలు మాని.. పని చేయాలని ప్రభుత్వ విప్ ఆదికి సూచన



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు

వేములవాడ, మార్చి 12: ఉమ్మడి రాష్ట్రంలో 42ఏండ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కరువు అని ప్రజలకు మరోసారి తెలిసేలా పాలన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చిల్లర రాజకీయాలతో పంటలకు నీరివ్వకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజా క్షేత్రంలో గెలిచి బాధ్యతారహితంగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నాయకులే లక్ష్యంగా అక్రమ కేసులతో వేధించినా.. కక్షసాధింపు చర్యలకు దిగినా సహించేదిలేదని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటామని, అన్ని వేళలా అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. వేములవాడలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షాత్తూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పర్ మానేరు వద్ద పైలాన్ ఆవిష్కరించి.. నాలుగేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మించి సస్యశ్యామలం చేస్తామని చెప్పినా పూర్తి చేయలేదన్నారు. 2008లో మధ్యమానేరు ప్రాజెక్టును ఇద్దరు కాంట్రాక్టర్లు ₹838కోట్ల పనులు మాత్రమే చేసి మధ్యలోనే వదిలేసిన విషయం మరిచిపోయారా? అని ప్రశ్నించారు. 2019లో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ₹1,587 కోట్లతో మధ్య మానేరు ప్రాజెక్టును పూర్తి చేయడమే కాకుండా.. తెలంగాణ మొత్తానికి గుండెకాయలాగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ మానేరువాగుపై11, మూలవాగుపై 13చెక్ డ్యాంలు నిర్మించారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిరిసిల్ల డివిజన్‌లోని 9మండలాలు ప్రతిసారి కరువు మండలాలుగా ఉండేవన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2014 కంటే ముందు 57,300 ఎకరాలలో వరి పండిస్తే, రాష్ట్రం వచ్చిన తర్వాత 1,77,370 ఎకరాలు సాగులోకి వచ్చాయని చెప్పారు. 2006 నుంచి 2014 వరకు అధికారంలో ఉండి ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించకుండా జఠిలం చేస్తే.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరించి పనులు పూర్తి చేశామన్నారు. విప్ ఆది శ్రీనివాస్‌కు నిర్వాసితులపై చిత్తశుద్ధి ఉంటే ₹5.4లక్షల హామీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ఇందిరమ్మ ఇండ్ల పేరిట జీవో విడుదల చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు.

### మల్కపేట ప్రాజెక్టును పూర్తి చేసినం

2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో నీటిపారుదలశాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డి 0.35టీఎంసీతో మల్కపేట ప్రాజెక్టు నిర్మాణానికి, సొరంగం పనులకు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మల్కపేట ప్రాజెక్టును మూడు టీఎంసీల ప్రాజెక్టుగా రూపుదిద్ది పనులు పూర్తి చేశారని, అందులో ఒక టీఎంసీని కూడా నీటిని ఎత్తిపోశారని గుర్తు చేశారు. అలాంటి ప్రాజెక్టులో కనీసం వానకాలమైనా రెండో టీఎంసీ నీటిని నింపాలన్న అవగాహన లేకుండా ఎమ్మెల్యే కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమై.. నీటిని నింపినట్టు ప్రజలు నమ్మించడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఈ ప్రాంత రైతుల పొలాలకు నీరివ్వకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తే నీటిని విడుదల చేశారని చెప్పారు.

### రైతులను మభ్యపెడుతున్నరు

ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజీ 2, ఫేస్ 1 పనులు బీఆర్‌ఎస్ హయాంలోనే 95శాతం పూర్తయ్యాయని చల్మెడ పేర్కొన్నారు. సూరమ్మ ప్రాజెక్టు పనులను తానే ప్రారంభించినట్టు ఆది శ్రీనివాస్ కొబ్బరి కాయలు కొట్టి.. ఫొటోలకు ఫోజులిస్తూ రైతులు, ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కుడి, ఎడమ కాలువ నిర్మాణాలకు 1,800 ఎకరాల భూ సేకరణ చేసి ₹176కోట్లతో కాలువ పనులు పూర్తి చేస్తేనే 43,100ఎకరాలకు సాగునీరు అందుతుందని, లేదంటే సూరమ్మ ప్రాజెక్టు మాత్రమే పూర్తయితే కేవలం 4,500ఎకరాలకు సాగునీరందుతున్న విషయాన్ని చెప్పకుండా మభ్యపెడుతున్నారని విమర్శించారు. నిజంగా రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే వరద కాలువ ద్వారా రుద్రంగి సూరమ్మ ట్యాంకును నింపేందుకు ₹536.5 కోట్లతో కూడిన ప్రాజెక్ట్ అనుమతులతోపాటు నిధులు తేవాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే ఈ ప్రాంత ప్రజల, రైతుల పక్షానా ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తామని స్పష్టంచేశారు.

### కోట్లాది రూపాయలతో వేములవాడ అభివృద్ధి

వేములవాడ అభివృద్ధిలో వెనుకబడిందన్న విప్ వ్యాఖ్యలను చల్మెడ తీవ్రంగా ఖండించారు. తొమ్మిదిన్నర ఏండ్ల బీఆర్‌ఎస్ పాలనలో వేములవాడ పట్టణం, రాజన్న గుడి అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తు చేశారు. ₹200 కోట్లకు పైగా నిధులతో రాజన్న ఆలయం, పరిసర రహదారులు, గుడి చెరువు, ఆలయ అభివృద్ధికి స్థల సేకరణకు కేటాయించామన్నారు. వేములవాడ పురపాలక సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినా.. అవి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 50ఏండ్లలో జరుగని అభివృద్ధిని, తొమ్మిదిన్నర ఏండ్ల కేసీఆర్ పాలనలో ప్రజలకు అందాయని గుర్తు చేశారు. విమర్శించేముందు స్థాయిని తెలుసుకొని జరిగిన అభివృద్ధి పై మాట్లాడాలన్నారు. కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రజలు అన్ని గమనిస్తున్నారని స్పష్టంచేశారు.

### రాజన్న గుడికి రూపాయి అయిన వచ్చాయా..

రాజన్న ఆలయ అభివృద్ధి పేరిట నవంబర్ 20న సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి శిలాఫలకాలు వేశారని గుర్తుచేశారు. ₹76కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పిన సీఎం.. దాదాపు వంద రోజులు దాటుతున్న ఒక రూపాయి కూడా రాలేదని విమర్శించారు. అసలు అభివృద్ధి పనులకు నిధులు తెచ్చి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని విమర్శించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ ఎంపీపీలు చంద్రయ్యగౌడ్, గంగం స్వరూప, రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, మ్యాకల ఎల్లయ్య, మల్యాల దేవయ్య, సత్తిరెడ్డి, నాయకులు కిరణ్, రవికుమార్, నిమ్మ శెట్టి విజయ్, గోలి మహేశ్, సిరిగిరి రామ్ చందర్, కటకం మల్లేశం, ఏశ తిరుపతి, చిలుక పెంటయ్య, వెంగల శ్రీకాంత్ గౌడ్, వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.